ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 27 ఆగస్టు 2024






కృష్ణాష్టమి వేళ ఖమ్మం నగరంలో చిన్నారులు గోపి, గోపికలుగా సందడిచేశారు. నగరంలోని ఓ ముస్లిం కుటుంబం తమ పిల్లలకు ఇలా కృష్ణుడి వేషం వేసి ఆకట్టుకుంది.

# జయ కృష్ణా ముకుందా మురారి..



కరకగూడెంలోని పంటపొలాల్లో గోపిగోపిక వేషధారణలో చిన్నారుల సందడి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల గృహిణులు తమ ఇళ్లలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఉంచి పూజలు నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పాఠశాలల్లో చిన్నారులు గోపి గోపిక వేషధారణలో సందడి చేశారు. పలుచోట్ల యువత, పిల్లలు ఉట్టి కొట్టి సంబురాలు చేసుకున్నారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ని కృష్ణుడి, గోపికల ఆహార్యం వేసి మురిసిపోయారు.



కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చిన్నారుల సందడి

## సీఎంఆర్ఎఫ్ స్కామ్‌పై
# కొరడా

- 19 ప్రైవేటు ఆస్పత్రులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన ప్రభుత్వం
- వీటి బిల్లులను సిఫార్సు చేయొద్దని ప్రజాప్రతినిధులకు ఆదేశం
- వైద్యం చేయకుండానే దొంగ బిల్లులతో కోట్లు మింగిన వైనం
- గతంలోనే 8 ఆస్పత్రులపై కేసులు పెట్టిన సీబీసీఐడీ పోలీసులు
- తాజాగా రంగంలోకి సీఐడీ.. విచారణకు రెడీ..
- ప్రైవేటు ఆస్పత్రుల దందాకు పరాకాష్ఠగా నిలిచిన కుంభకోణం





ఖమ్మం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) డబ్బులను దొడ్డిదారిన హాంఫట్ చేసిన ప్రైవేటు ఆస్పత్రుల కుంభకోణంలో మళ్లీ కదలిక వచ్చింది. వైద్యం చేయకుండానే పెద్దఎత్తున బిల్లులు పెట్టి ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సులు చేయించుకుని కోట్లు మింగిన వైనంపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఈ విషయమై గత ప్రభుత్వ హయాంలో పలు ఆస్పత్రులపై కేసులు నమోదు కాగా, మళ్లీ సీఐడీ ఈ కేసుల విచారణకు రంగం సిద్ధం చేస్తోంది. తాజాగా ఖమ్మం జిల్లాలో 19 ఆస్పత్రులకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎలాంటి బిల్లులు పంపవద్దని, ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టిన ఆసుపత్రుల జాబితాను ప్రజాప్రతినిధులకు పంపించడం చర్చనీయాంశంగా మారింది.

రోగులనుంచి సొమ్ములు గుంజడమే వ్యాపార లక్ష్యంగా పెట్టుకున్న ప్రైవేటు ఆస్పత్రులు.. ముఖ్యమంత్రి సహాయనిధి కింద సొమ్ములు గుంజేందుకు అడ్డదారులు తొక్కారు. వైద్యం చేయకుండానే పెద్దఎత్తున బిల్లులు పెట్టి ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సులు చేయించుకుని దందాలకు పాల్పడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ అక్రమాల రాకెట్ పెద్దఎత్తున నడిచింది. కొంతమంది ఆర్ఎంపీలు, పేషంట్లు, ప్రభుత్వ ఆస్పత్రులు కుమ్మక్కై లక్షలాది రూపాయలు కాజేశారు. దీంతో హైదరాబాదు సీసీఎస్ పోలీసులు గతంలో దర్యాప్తు చేసి 8 ఆసుపత్రులపై కేసులు నమోదుచేసి విచారణ చేశారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో పేదలు, మధ్యతరగతి వర్గాలు సొంత డబ్బులు చెల్లించి వ్యాధి నయం చేయించుకుంటే ఆ తర్వాత అన్ని బిల్లులతో ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సులు చేయించుకుని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం ద్వారా సగం వరకు డబ్బులు

(మిగతా 6వ పేజీలో)

### ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన ఖమ్మం ఆస్పత్రులు ఇవే

ఆదిత్య, ఎపెక్స్, శ్రీసాయి మల్టీస్పెషాలిటీ, శ్రీకృష్ణ, ఆర్కా, ఆదర్శ మల్టీ స్పెషాలిటీ, భార్గవ సూపర్ స్పెషాలిటీ, డాక్టర్ జేఆర్ ప్రసాద్, గ్లోబల్, ఇండస్, మ్యాక్స్‌కేర్, న్యూ అమృత, ఆరెంజ్, సాయికిరణ్, శ్రీవినాయక సూపర్ స్పెషాలిటీ, సురక్ష, సుజాత, వైష్ణవి, వెంకటేశ్వర ఆస్పత్రి.



# 'దివాలా' దందా

కొందరు సమాజంలో పెద్దమనిషి తరహాలో ఫోజులు కొడతారు.. కాలు బయట పెడితే కారు ఎక్కిన తర్వాతనే మాట్లాడతారు.. దర్పం ప్రదర్శిస్తారు... దర్జాగా జీవించినట్టు కనిపిస్తారు... అవన్నీ నమ్మి వారు అడిగినప్పుడల్లా అప్పు ఇచ్చారా.. ఇక అంతే సంగతులు. ఇచ్చిన నగదు తిరిగి తెచ్చుకునేవరకు కాళ్ల చెప్పులరిగేలా తిప్పిస్తారు. అయినా చేతికి రూపాయి వస్తుందనే నమ్మకం లేదు. చివరికి తన చేతిలో చిల్లిగవ్వ లేదంటూ ఐపీ దాఖలు చేస్తారు. ఇదీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని కొందరు బడాబాబుల తీరు. జనం నుంచి అందినకాడికి దండుకుని దివాలా పిటీషన్లు దాఖలు చేయడం పరిపాటిగా మారుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## రుణదాతలను నమ్మించి నట్టేట ముంచుతున్న బడాబాబులు

- అందినకాడికి పుచ్చుకొని దివాలా పిటిషన్ల దాఖలు
- ప్రతిఏటా పదుల సంఖ్యలో పిటిషన్లు
- రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థిక మోసాల కేసులు
- ఐపీ దాఖలు చేసిన అనంతరం సెటిల్‌మెంట్లు
- లోలోపలే కుములుతున్న అప్పులిచ్చిన వాళ్లు

ఖమ్మం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కేబుల్ వ్యాపారంలో ఒకరు, భవన నిర్మాణ రంగంలో మరొకరు, మామిడి వ్యాపారంలో నష్టం వచ్చిందని ఇంకొకరు.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ రోజు ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు ఐపీ (ఇన్‌సాల్వెన్సీ పిటిషన్) దాఖలు చేస్తూనే ఉన్నారు. ఇలా ప్రతీయేటా వందల సంఖ్యలో పిటిషన్లు దాఖలవుతుండగా.. వాటిల్లో న్యాయబద్ధంగా ఉన్నటువంటి పదుల సంఖ్యలో దరఖాస్తులను మాత్రమే న్యాయస్థానాలు స్వీకరిస్తున్నాయి. అలా స్వీకరించిన వాటిల్లో గడిచిన మూడేళ్లలో సుమారు 100కేసుల వరకు నమోదవగా.. 2011లో 23, 2022లో 32, 2023లో 28 కేసులు ఉన్నాయి. ఈ యేడాది ఇప్పటివరకు 12 కేసులను న్యాయస్థానాలు స్వీకరించినట్లు తెలుస్తోంది. అయితే ఇవి కేవలం అధికారికంగా నమోదైన కేసులే కాగా.. అసలు నగదు ఎగ్గొట్టి సమాజంలో దర్జాగా తిరుగుతున్నవారు బోలెడు మంది ఉన్నారు.

ఇవి పక్కన పెడితే చిట్టీల పేరుతో కొందరు, స్కీంల పేరుతో, అధిక వడ్డీ ఆశచూపి ఉమ్మడి జిల్లాలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న సంఘటనలు ఎక్కువవుతూనే ఉన్నాయి. ఆయా వ్యక్తులు నేరుగా ఐపీలు దాఖలు చేయనప్పటికీ ప్రజలను మోసం చేసి మకాం మార్చేస్తున్నారు. మోసపోయిన బాధితులు చివరకు పోలీస్‌స్టేషన్ మెట్లెక్కాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో నమోదయ్యే వేల కేసుల్లో సాధారణ కేసులతో సమానంగా ఆర్థిక నేరాలు ఉండటం గమనార్హం. అయితే సంబంధిత దరఖాస్తులు స్వీకరిస్తున్న పోలీసులు మాత్రం చీటింగ్ కేసుకు మాత్రమే పరిమితమవుతుండటంతో మోసగాళ్లు మరిన్ని మోసాలకు పాల్పడుతున్నారు.

### వస్త్ర వ్యాపారి.. రూ.100 కోట్లు..

ఖమ్మం నగరంలో గతమెంతో ఘనంగా బతికిన ఓ బడా వస్త్ర వ్యాపారి తాజాగా ఐపీ బాటలో వున్నట్టు తెలిసింది. ఈయన కొద్ది రోజులుగా తమ షాపులు తీయకుండా ఉడాయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నేళ్ల నుంచి అప్పులతో నెట్టుకొచ్చిన ఈ వ్యాపారి రూ.100 కోట్లకు పైగా అప్పులు చేసి పలు వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టినట్టుగా సమాచారం. ఇటీవల కాలంలో అప్పుల సంఖ్య పెరిగిపోవడం, రుణదాతలు తమ సొమ్ము తిరిగివ్వాలని అడుగుతుండటంతో అతడు ముఖం చాటేసినట్టు ప్రచారం జరుగుతోంది. షాపులు మూసి ఉండడంతోపాటు అతడు ఫోన్‌లోనూ అందుబాటులో లేకపోవడంతో అప్పులిచ్చినవారు ఆందోళన చెందుతున్నట్టు సమాచారం. అయితే సదరు వ్యాపారి మాత్రం తాను తీసుకున్న నగదులో రుణదాతలకు 20శాతం తిరిగిస్తానంటూ చెబుతున్నట్టు తెలుస్తోంది.

### పిటిషన్ల దాఖలు.. ఆపై సెటిల్‌మెంట్లు..

రాజ్యాంగం కల్పించిన హక్కును అడ్డం పెట్టుకొని కొందరు పెద్దలు ఆర్థిక మోసాలకు పాల్పడి తమ జేబులు నింపుకొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి వ్యాపారంలో నష్టాలు వచ్చిన సందర్భాల్లో ఆయా వ్యక్తులు తిరిగి అప్పులు చెల్లించలేని సమయంలో మాత్రమే ఐపీ దాఖలు చేసే అవకాశం ఉంది. కానీ ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్న కొందరు వీఐపీలు సామాన్య, మధ్య తరగతి ప్రజల నుంచి అందినకాడికి అప్పులు తీసుకొని ఆ తరువాత పథకం ప్రకారం తమ పేరు మీద ఎలాంటి ఆస్తులు లేకుండా చూసుకుని ఆపై కొద్ది రోజులపాటు ముఖం చాటేసి తమ దగ్గర చిల్లిగవ్వ లేదంటూ మార్కెట్‌లో ప్రచారం జరిగేలా చూసుకుంటున్నారు. ఆ తర్వాత దివాలా పిటీషన్ దాఖలు చేస్తున్నారు. దాంతో వారికి రుణాలు ఇచ్చినవారు, నమ్మి పెట్టుబడి పెట్టినవారు తమ దగ్గరకు వచ్చి బతిమిలాడుకునేలా చేసి ఎంతోకొంత ఇస్తామంటూ సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారు.

### గతంలో దాఖలైన ఐపీల్లో కొన్ని..

- విజయవాడకు చెందిన దంపతులు పలు ఏజెన్సీల పేరుతో గూడ్స్ రవాణా, నిర్మాణ రంగంలో పని చేస్తూ తమ వ్యాపారాన్ని విస్తరించాలన్న ఉద్దేశంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురి నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. చివరకు 127 మందిని ప్రతివాదులుగా చూపుతూ రూ.61.75 కోట్లకు ఐపీ దాఖలు చేశారు.
- ఖమ్మం పట్టణానికి చెందిన పత్తి, మిర్చి కమీషన్ వ్యాపారి రూ.1.85కోట్లకు ఐపీ పిటీషన్ దాఖలు చేశాడు. మొత్తం 44మందిని ప్రతివాదులుగా చూపించిన అతడు తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు చేయగా నష్టం వాటిల్లినట్టు పిటిషన్‌లో పేర్కొన్నాడు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సింగరేణి కాలరీస్ ఉద్యోగిగా పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఓ వ్యక్తి మామిడి వ్యాపారంలో నష్టం వచ్చిందంటూ రూ.90లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. 22మందిని ప్రతివాదులుగా చూపిన ఆయన ఆయా వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకున్నట్టు పేర్కొన్నాడు.





ఖమ్మంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

### సామాజిక మార్పుల్లో సోషల్ మీడియాది కీలకపాత్ర

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం 6



కూసుమంచిలో గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

### గీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

కాటమయ్య కిట్ల పథకాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి 6

## నేడు మంత్రి తుమ్మల పర్యటన

- ఖమ్మం కలెక్టరేట్‌లో నియోజకవర్గస్థాయి అభివృద్ధిపై సమీక్ష



ఖమ్మం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో ఖమ్మం నియోజకవర్గస్థాయి అభివృద్ధి పనులపై, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12గంటగలకు ప్రకాష్‌నగర్‌లో డ్రెయినేజీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

## విద్య కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, ఆగస్టు 26: ప్రభుత్వం విద్యకోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. సోమవారం మండలంలోని పెదగొల్లగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం రూ.కోట్లు ఖర్చుపెడుతుందని, అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# నిండా ముంచిన ముంబై కంపెనీ...

- దర్జాగా 'కేటీపీఎస్‌లో దందా' పూర్తి
- కంచికి చేరిన స్క్రాప్ తరలింపు కథ
- కూల్చివేత పనులు పూర్తి చేసుకున్న కాంట్రాక్టర్
- టెండర్‌లో చెప్పిన దానికంటే అదనంగా తరలింపు
- భూగర్భ కేబుళ్ల స్వాహా సమయంలో అలెర్ట్ చేసిన 'ఆంధ్రజ్యోతి'
- పట్టించుకోని జెన్‌కో
- గత సర్కారు అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం మౌనం



పాల్వంచ కేటీపీఎస్ పాత ప్లాంట్ తుక్కు తరలింపు కుంభకోణం కథ అసంపూర్తిగానే కంచికి చేరింది. దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చి, ఎంతో మందికి జీవనోపాధి కల్పించిన కేటీపీఎస్ కర్మాగారం చరిత్రలో చేరింది. ముంబై కంపెనీ పనులు పూర్తి చేసుకుని తట్టా బుట్టా సర్దేసింది. కూల్చివేత, తరలింపు, టెండర్లలో అక్రమాలు జరిగాయనే అభియోగాలు వచ్చినా జెన్‌కోకు చీమకుట్టినట్లు కూడా లేదు. అక్రమాల గుట్టు రట్టు చేయాలని గొంతెత్తి అరిచినా ఫలితం లేకుండా పోయింది. స్క్రాప్ పేరుతో విలువైన సంపదను దోచుకుపోతున్నా నిద్రమత్తు వీడలేదు. ఇంతా జరిగినా కేవలం ఓ డీఈ స్థాయి అధికారిని విచారణాధికారిగా నియమించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వేల కోట్ల రూపాయలు మింగిన భోక్తలెవరో తేలకుండానే కథ ముగిసిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

-పాల్వంచ 6



మృతి చెందిన సమ్మక్క (ఫైల్



చికిత్స పొందుతున్న సర్వేష్ (ఫైల్)

## దంపతులకు విద్యుత్‌షాక్

- భార్య మృతి.. చావుబతుకుల మధ్య భర్త...
- పాండురంగాపురంలో విషాదం 7



## చెస్ పోటీల్లో మెరిసిన ఖమ్మం

» సత్తాచాటిన నగర క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 26: హైదరాబాద్‌లోఆదివారం జరిగిన 48వ రాష్ట్రస్థాయి చెస్ ర్యాంకింగ్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. పోటీల్లో పాల్గొన్న చతురంగ్వేద చెస్ అకాడమీ చిన్నారులు హిమసారిక ద్వితీయ స్థానం సాధించగా, మనీష్ 6వ, అక్షజ్ 9వ, అనీష్‌సూర్య 21వ స్థానం, ఆయాన్ 24వ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను కోచ్‌లు ఉత్తమ్‌నరేష్, దిలీప్ అభినందించారు.

## కేవీలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 26: నగరంలోని కరుణగిరి ప్రాంతంలో గల కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలలో 2 నుంచి 8వ తరగతి వరకు మిగిలిన ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29లోగా ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు పాఠశాల కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు.

# కుదింపు కుదుపు..

» సగానికి తగ్గిన వైరా ఆసుపత్రి స్థాయి
» ఏరియా ఆసుపత్రిలో 100నుంచి 50పడకలకు తగ్గింపు
» జూలైలోనే సర్క్యులర్ వేసిన ప్రిన్సిపుల్ సెక్రటరీ
» వాస్తవాన్ని దాచిపెట్టిన వైద్య శాఖ అధికారులు
» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఈనెల 9న శంకుస్థాపన
» వందపడకల కోసం ప్రభుత్వాన్ని కోరుతూ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ లేఖ

వైరా, ఆగస్టు 26: వైరాలో వందపడకలతో నిర్మించే ఏరియా ఆసుపత్రి పరిధిని 50పడకలకు కుదిస్తూ జూలైలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సర్క్యులర్ విషయాన్ని అంతగా పరిగణలోకి తీసుకోని అధికారులు ఈనెల 9న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. 2023 జూలై 27వతేదీన జీవోఆర్‌టీనెం. 419ద్వారా హెచ్ఎం అండ్ ఎఫ్‌డబ్ల్యూ ద్వారా వైరాకు వందపడకల ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.37.50కోట్లను మంజూరు చేశారు. అయితే గతనెలలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించే 12 ఆసుపత్రుల అభివృద్ధిని సమీక్షించిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ వైరాలో వందపడకల ఏరియా ఆసుపత్రికి బదులు 50పడకల ఆసుపత్రిని నిర్మించాలని ఉత్తర్వులు ఇచ్చారు. జూలై 9న జారీ అయిన సర్క్యులర్ అదేనెల 12వతేదీ నాటికి టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు చేరింది.

**పూర్తి కాని టెండర్ ప్రక్రియ...**

ఈనెల 9వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చేపట్టిన పర్యటనలో అధికారులు హడావుడిగా వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. భట్టి విక్రమార్క శిలాఫలకాన్ని ఆవిష్కరించే ముందు అక్కడే ఈ వందపడకల ఆసుపత్రి టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టు ఒప్పందాలు, విధివిధానాల గురించి వైద్యఆరోగ్యశాఖ అధికారులను, వైద్యఆరోగ్యశాఖ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అయితే అధికారులు నీళ్ల నమలడంతో భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధివిధానాలు, టెండర్ల ప్రక్రియ పూర్తికాకుండా ఓవర్ యాక్షన్ చేస్తే చర్యలు తీసుకుంటానని కూడా ఆయన హెచ్చరించారు. ఆసమయంలో టెండర్లు చేపట్టలేదనే విషయాన్ని మాత్రమే చెప్పిన అధికారులు జూలై 9వతేదీనే వందపడకల నుంచి 50పడకలకు కుదిస్తూ ప్రిన్సిపుల్ సెక్రటరీ నుంచి కమిషనర్ ద్వారా వచ్చిన సర్క్యులర్ గురించి భట్టి విక్రమార్కకు అధికారులు చెప్పకుండా దాచిపెట్టారనే విమర్శలున్నాయి.



శంకుస్థాపన సందర్భంగా వైద్యఆరోగ్యశాఖ అధికారులను నిలదీస్తున్న భట్టి విక్రమార్క(ఫైల్)

**అప్రమత్తమైన ఎమ్మెల్యే..**

వందపడకల నుంచి 50పడకలకు కుదిస్తూ వచ్చిన సర్క్యులర్ వెలుగులోకి రావడంతో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు అప్రమత్తమయ్యారు. వైరాలో వందపడకల ఆసుపత్రిని నిర్మించాలని, టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తిచేసి నిర్మాణాన్ని ప్రారంభించాలని సీఎం, డిప్యూటీ సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ, కమిషనర్, ఖమ్మంజిల్లా కలెక్టర్‌కు లేఖలు రాశారు.

**స్థల సేకరణ పూర్తి..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిప్యూటీ సీఎం హోదాలో భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తొలిసారి వచ్చినప్పుడే వందపడకల ఆసుపత్రికి అవసరమైన స్థలాన్ని సేకరించాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, తహసీల్దార్‌కు స్పష్టం చేశారు. ఆవెంటనే జాతీయ ప్రధాన రహదారికి సమీపంలో దాదాపు ఐదెకరాలకుపైగా స్థలాన్ని ఈ ఆసుపత్రి కోసం సేకరించారు. జిల్లా కలెక్టర్ కూడా ఈ స్థలానికి ఆమోదముద్ర వేశారు. శాశ్వత భవనాలు నిర్మించేవరకు వేచి ఉండకుండా ప్రత్యామ్నాయ భవనాల్లో వందపడకల ఆసుపత్రిని ప్రారంభించి నిర్వహించాలని భట్టి విక్రమార్క ఆదేశించడంతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పలు భవనాలను పరిశీలించారు. ప్రైవేట్ భవనాలు లభ్యం కాకపోవడంతో ఇప్పటికే వందపడకల ఆసుపత్రికి కేటాయించిన కొద్దిమంది వైద్యులు, సిబ్బందితో వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ఈ ఆసుపత్రి కార్యకలాపాలను తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ ఓవైపు జరుగుతుండగానే గతనెలలో వందపడకల ఆసుపత్రిని 50పడకలకు కుదిస్తూ వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన సర్క్యులర్ పెను సంచలనంగా మారింది.

## గీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

» రాష్ట్ర రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, ఆగస్టు 26: గీతకార్మికుల సంక్షేమానికి, భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఖమ్మంజిల్లా కూసుమంచి మండల కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షకిట్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్మికులు తాటిచెట్టు ఎక్కే సమయంలో ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. బీసీ కార్పొరేషన్, ఎక్సైజ్ శాఖల ద్వారా తెలంగాణ కల్లుగీత కార్మికుల సహకారసంఘం సహకారంతో సేఫ్టీ కిట్లను లబ్ధిదారులకు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఐఐటీ నిపుణులతో కిట్లను తయారు చేసినట్టు పేర్కొన్నారు. గీత కార్మికుల ప్రాణాలకు ప్రజాప్రభుత్వం రక్షణ కవచమని తెలిపారు. ఈత, తాటి వనాల పెంపు ద్వారా కార్మిక కుటుంబాలకు ఆర్థిక చేయూతనందిస్తున్నట్టు మంత్రి తెలిపారు. గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, కింద పడి ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రత్యేక కిట్లను తయారు చేసి అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్ల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్లు పొంగులేటి వివరించారు. రియల్ వెంచర్లలోనూ, రోడ్ల వెంబడి తాటి, ఈత చెట్లనె పెంచాలని తెలిపారు. ప్రమాదానికి గురై మృతిచెందిన కార్మికులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్, ఖమ్మం ఆర్డీవో గణేష్, బీసీ జిల్లా సంక్షేమాధికారిణి జ్యోతి, జిల్లా సహాయ ఎక్సైజ్ సూపరిండెంట్ వేణుగోపాలరెడ్డి, ఏడీఏ సరిత, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఇరిగేషన్ ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 26: ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో మంగళవారం నుంచి ఈనెల 29 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు మంగళవారం ఉదయం 8 గంటల నుంచే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

## రుణమాఫీని ఆంక్షలు లేకుండా అమలుచేయాలి

తల్లాడ, ఆగస్టు 26: అధికారంలోకి వస్తే రూ.రెండులక్షల రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్.లాల్‌మియా డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15నాటికి రూ.రెండులక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి పూర్తిస్థాయిలో అమలుచేయడంలో ప్రభుత్వం మొండిచెయ్యి చూపించిందని విమర్శించారు.

# సిరులిచ్చే చిరుధాన్యాలు

» పోషకవిలువలతో కూడిన సాగు లాభదాయకం
» ఈనెల ఆఖరు వరకు సాగుకు అనుకూలం
» మధిర వ్యవసాయ రీసెర్చ్ స్టేషన్

మధిర, ఆగస్టు 26: పోషక విలువలతో కూడిన చిరుదాన్యాల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుంది. వర్షాదారం, సాగునీటిపారుదల కింద సాగుచేసుకోవచ్చు. ఈ పంటలను ఆగస్టు నెల ఆఖరువరకు సాగుచేసుకొనేందుకు అనుకూలమని మధిర వ్యవసాయ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పత్యామ్నాయ పంటలుగా చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామ, వరిగ, ఊద, అరిక, అండుకొర్ర పంటలు చాలా ఉపయోగంగా ఉంటాయని ప్రధాన శాస్త్రవేత్త డా. రుక్మిణీదేవి, డా. భరత్, డా. కె నాగస్వాతి తెలిపారు. ఈ పంటల సాగులో ఆచరించాల్సిన పద్ధతులు గురించి రైతులకు వివరించారు.



**సాగుకు అనుకూలం...**

నైరుతి రుతుపవనాల ద్వారా పడే వర్షాలను ఆధారంగా చేసుకొని జూన్ రెండో పక్షం నుంచి ఆగస్టు చివరి వరకు సాగుచేసుకోవచ్చు. జొన్న పంట - ఈ పంట 95-110 రోజుల కాలపరిమితి కలిగి 12-14క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. సీఎస్‌హెచ్-14, సీఎస్‌హెచ్-16, యన్‌టీజే-2, యన్‌టీజే-4, యన్‌టీజే-5 రకాలు అనుకూలం. సజ్జ పంట - ఈ పంట 75-90రోజుల కాలపరిమితి కలిగి 8-10క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. ఐసీటీపీ-8203, ఐసీయంహెచ్-356, హెచ్‌హెచ్‌బీ-121, ఏబీవి-04 రకాలు అనుకూలంగా ఉంటాయి. రాగి పంట - ఈ పంట 105-120 రోజుల కాలపరిమితి కలిగి 12-14క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. వకుళ, శ్రీచైతన్య, హిమ, తిరుమల, గౌతమి, ఇంద్రావతి రకాలు అనుకూలంగా ఉంటాయి. కొర్ర పంట - ఈ పంట 68-85 రోజుల కాలపరిమితి కలిగి 10-12క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. యస్ఐఏ-3085, సూర్యనంది, గరుడ, మహానాడు అనుకూలంగా ఉంటాయి. సామ పంట - ఈ పంట 75-105 రోజుల కాలపరిమితి కలిగి 7-8క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. బిఎల్-6, ఒఎల్ఎం-217, ఒఎల్ఎం-203, కొ-4 రకాల అనుకూలంగా ఉంటాయి. అరిక పంట - ఈ పంట 95-100 రోజుల కాలపరిమితి కలిగి 10-12క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. టీఎఎన్‌యు-86, జేకే-98, జేకే-65, జేకే-48 రకాలు అనుకూలం. వరిగ పంట - ఈ పంట 65-75 రోజుల కాలపరిమితి కలిగి 7-8క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. టీఎన్ఎయు-202, టీఎన్ఎయు-143, పీఆర్-18, కొ-4 రకాలు అనుకూలం. అండుకొర్ర పంట - ఈ పంట 90-100రోజుల కాలపరిమితి కలిగి 6-8క్వింటాళ్లు ఎకరానికి దిగుబడి వస్తుంది. జిపియుబిటి-6, టిఎన్‌బిఆర్-001, వెవెయంఆర్ఎకె-2 రకాలు అనుకూలంగా ఉంటాయి.

**విత్తన శుద్ధి తప్పనిసరి...**

ఎకరాకు నాలుగు కిలోల విత్తనం సరిపోతుంది. ఒక కిలో విత్తనానికి 2గ్రా. కార్బండిజమ్ లేదా 3గ్రా. కాప్టాన్‌గాని, థైరామ్‌గాని కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని వరుసల మధ్య 22.5 సెం.మీ. , మొక్కల మధ్య 10సెం.మీ. ఎడంగా గొర్రుతో విత్తుకోవాలి. జొన్న, సజ్జ, అండకొర్రలు మాత్రం వరుసల మధ్య 45సెం.మీ. మొక్కల మధ్య 12-15సెం.మీ. ఎడంగా విత్తుకోవాలి. విత్తిన రెండు వారాల లోపు ఒత్తు మొక్కలు తీసివేయాలి. విత్తిన 20-25 రోజుల లోపు దంతిలో అంతరకృషి చేసి కలుపు మొక్కలను తీసివేయాలి. కలుపు నివారించేందుకు అట్రజన్ 500గ్రా. లేదా బ్యూటాక్లోర్ 750మి.లీ. ఎకరానికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే 1-2రోజుల లోపు తడి నేలపై పిచికారి చేయాలి.

**ఎరువులు...**

అన్ని పంటలకు ఎకరాకు 4టన్నుల పశువుల ఎరువు ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.

జొన్న, సజ్జ పంటలు వర్షాదారంగా పండించినట్లయితే 24కిలోల నత్రజని, 16కిలోల భాస్వరం, 12కిలోల పోటాష్ నిచ్చే ఎరువులు వేయాలి. నీరుపాదల పంటలకు 32కిలోల నత్రజని, 24కిలోల భాస్వరం, 16కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. రాగి పంటకు ఎకరాకు 24కిలోల నత్రజని, 12కిలోల భాస్వరం, ఎనిమిది కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. మిగతా చిరుధాన్యాలు కొర్ర, సామ, వరిగ, ఊదు, అండకొర్రలకు ఎనిమిదికిలోల నత్రజని, ఎనిమిదికిలోల భాస్వరం, ఎనిమిదికిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. వర్షాధారంగా చిరుధాన్యాలను సాగుచేసేటప్పుడు నేలలో తగినంత తేమశాతం ఉండేలా చూసుకొని ఎరువులు వేసుకోవాలి.

భద్రాద్రిలో ఘనంగా

## కృష్ణాష్టమి వేడుకలు

» నేడు రామాలయంలో శ్రీవైష్ణవ కృష్ణాష్టమి
» భక్తిశ్రద్ధలతో దశమ స్కంధ హోమం



భద్రాచలం, ఆగస్టు 26: భద్రాచలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపం రోడ్డులో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి పాలు, అటుకులు, బెల్లం, కాయం, వెన్నలను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. అలాగే సాయంత్రం ఆలయం వద్ద ఉట్లు కొట్టే వేడుక నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో సైతం ఉట్ల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పలువురు ఇళ్లల్లో తమ చిన్నారులకు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషదారణలను ధరింపజేశారు.

**నేడు రామాలయంలో శ్రీ వైష్ణవకృష్ణాష్టమి**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ వైష్ణవ కృష్ణాష్టమిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, లాలలు, జోలలు నిర్వహించనున్నారు. దేవస్థానంలో బుధవారం ఉట్ల పండుగ నిర్వహించనున్నారు.

**భక్తిశ్రద్ధలతో దశమ స్కంధ హోమం**

భద్రాద్రి దేవస్థానంలో నిర్వహిస్తున్న తొమ్మిదో శ్రీమద్భాగవత సప్తాహంలో భాగంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో దశమ స్కంధ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యపూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, రుగ్వేద పండితులు కామేశ్వర శర్మ పాల్గొన్నారు.

# నిండా ముంచిన ముంబై కంపెనీ

» దర్జాగా 'కేటీపీఎస్‌లో దందా' పూర్తి

పాల్వంచ, ఆగస్టు 25: పాల్వంచ కేటీపీఎస్ 7వ దశ పాత ప్లాంట్(ఓఅండ్ఎం)ను 1966వ సంవత్సరంలో నిర్మించారు. కర్మాగారం నిర్మించి 58 ఏళ్ల గడిచినా నిర్మాణం జరిగిన నాటి నుంచి వినియోగిస్తున్న యంత్రాల సామర్థ్యం ఏమాత్రం తగ్గలేదు. ఈ క్రమంలోనే గతంలో వినియోగించిన టెక్నాలజీని ఆపేసి సూపర్ క్రిటికల్ టెక్నాలజీని కేంద్రం ప్రవేశపెట్టింది. సరిగ్గా ఇదే సమయంలో పాత ప్లాంట్‌ను కూల్చివేయాలని, అందులోని విలువైన రూ. కోట్ల విలువైన స్క్రాప్‌ను దొడ్డి దారిని తరలించి సొమ్ము చేసుకోవాలని కొందరు పావులు కదిపారు. వారికి సంస్థలోని కొందరు ఉన్నతాధికారులు, రాజకీయ మేధావులు పూర్తిస్థాయిలో సహకరించారు. ఇంకేముంది పాత ప్లాంట్‌ను 2020 ఏప్రిల్ 11న మూతవేశారు.

**కారు చౌకగా టెండర్...**

ఆ కర్మాగారాన్ని కూల్చివేసి అందులోని ఐరన్, కాపర్, అల్యూమినియం,రబ్బర్, ప్లాస్టిక్, సిల్వర్‌తో పాటు మిషనరీని, స్క్రాప్‌ను తరలించడానికి టెండర్లు పిలిచారు. సుమారు రూ.2000 వేల కోట్ల విలువైన స్క్రాప్‌ను తరలించడానికి హెచ్ఆర్ అనే ముంబై కంపెనీకి కేవలం రూ. 485 కోట్లకే కారుచౌకగా కట్టబెట్టారు. 2030 వరకు పాత ప్లాంట్‌ను కూల్చవద్దని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నా కూల్చివేత పనులను 2023 జనవరి 18 నుంచి ప్రారంభించారు. అప్పటి నుంచి యథేచ్ఛగా సాగిన స్క్రాప్ దందాను ఏప్రిల్ మొదటి వారంలో 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేసింది. గత ప్రభుత్వంలో జరిగిన కుంభకోణం కాబట్టి ప్రస్తుత ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని, పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులను శిక్షిస్తుందని అందరూ భావించారు. ఏమి జరిగిందో తెలియదు కాని పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆగస్టు 5న జరిగిన కూలింగ్ టవర్ల కూల్చివేతతో సదరు కాంట్రాక్టర్‌కు అప్పగించిన పనులు మొత్తం పూర్తయ్యాయి.



తరలించడానికి సిద్ధం చేసిన యాష్‌పాండ్ పైపులు(ఫైల్)

**గోప్యతే అధికారుల ఆయుధం**

కేటీపీఎస్ 7వ దశలో ఏది జరిగినా గోప్యంగానే ఉంటుంది. ఇక్కడి అధికారులకు అదే పెద్ద ఆయుధంగా మారింది. ఇక్కడ సీఈ ఏది చెప్తే అదే శాసనం. అతను చేసిందే చట్టం. ఎవరైనా కాదని అతిక్రమిస్తే బదిలీ చేయడమే. అతనికి జెన్కో ఉన్నతాధికారుల అండదండలు పూర్తిస్థాయిలో ఉండటంతో తిరుగేలేకుండా పోయింది. అందుకే కోట్లాది రూపాయల విలువైన స్క్రాప్‌ను తరలించడానికి పాటించాల్సిన నియమ నిబంధలకు పాతర వేశారు. వాస్తవంగా భూమి పై భాగంలోని నిర్మాణాలను కూల్చడం, వాటిని తరలించడం వరకే టెండర్లలో పొందుపరచబడి ఉంది. కానీ సదరు అధికారి మాత్రం కోట్ల కమీషకు కక్కుర్తి పడ్డాడో, లేక ఉన్నతాధికారుల ఆదేశాలను ఆమలు చేశాడో, లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గాడో తెలియదు కానీ టెండర్ దారులకు పూర్తి స్థాయిలో సహకరించడంతో భూగర్భంలోని విలువైన కేబుల్స్ సైతం మాయం చేశారు. ఇప్పటికైనా జెన్కో ఉన్నతాధికారులు పూర్తి విచారణకు ఆదేశించాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

## జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

పాల్వంచ టౌన్, ఆగస్టు 26: జర్నలిస్టుల సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టులు నిజాలను నిర్భయంగా రాయాలన్నారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలో జెన్కోలో కేటాయించిన స్థలంలో శ్యామల గోపాలన్ ఫౌండేషన్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి నేతృత్వంలో నూతనంగా నిర్మించిన ప్రెస్‌క్లబ్‌ను సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వారికి వ్యతిరేకంగా వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టిన చరిత్ర ఉందన్నారు. తమ ప్రభుత్వంలో విలేకరులు స్వేచ్ఛగా వార్తలు రాసుకునే వీలుందన్నారు. "ఆ ట్యూబ్‌లు.. ఈ ట్యూబ్"ల పేరిట తమ ప్రభుత్వంపై బురదజల్లే వారు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. తప్పులు ప్రభుత్వం చేసినా ప్రతిపక్షం చేసినా విలేకరులు ధైర్యంగా వార్తలు రాసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైఎస్ హయంలో హైదరాబాద్‌లో 72ఎకరాల భూమిలో 1,050మంది విలేకరులకు ఇంటి పట్టాలు ఇచ్చినా గత ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం త్వరలోనే జవహర్ సొసైటీకి ఆయా స్థలాలను భారీ బహిరంగసభ నిర్వహించి అందచేస్తామన్నారు. కొన్ని పింక్‌పేపర్లు తమపై వ్యతిరేకంగా వార్తలు రాసినా పట్టించుకోబోమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం మాటలు మాత్రమే చెప్పిందని, తమ ప్రభుత్వం చేసి చూపిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో పాల్వంచ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల కొండలరావు, కేటీపీఎస్ ట్రైనింగ్ సెంటర్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసబాబు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, ఎపీఆర్‌వో ఆస్గర్ హుస్సేన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, ప్రెస్‌క్లబ్ నిర్మాణదాత నల్ల సురేష్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి షేక్ సుభాని, సంజీవ్ కుమార్, చంద్ర నర్సింహారావు, రజాక్, వెంకటనారాయణ, ఎ. అబ్బురాం, ఆర్. కృష్ణమూర్తి, జైనుల్లాబుద్దీన్, జగదీష్, వాజీద్, వై.శ్రీనివాసరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యూనియన్ నాయకులు కల్లోజి శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, సీపీఎం, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక మార్పుల్లో సోషల్ మీడియాది కీలకపాత్ర

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మంటౌన్, ఆగస్టు 26: ప్రజాసమస్యల పరిష్కారంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. సీపీఎం సోషల్‌మీడియా రాష్ట్రస్థాయి రెండురోజుల రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో ప్రారంభమయ్యాయి. సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టల రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ సోషల్‌మీడియా వేదికగా సీపీఎం కార్యాచరణ చేపట్టనుందన్నారు. పార్టీ పనివిధానాలు, సిద్ధాంతాలను ప్రజలకు తెలియచేయడంలో తమ నాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని, ఇకనుంచి సోషల్‌మీడియా వేదికగా కార్యకలాపాలు చేపడతామన్నారు. సోషల్‌మీడియాతో యువత ప్రభావితం అవుతుందని అందుకే ఆధునిక ఆలోచనలతో కూడిన పార్టీ కార్యక్రమాలను మీడియా ద్వారా తెలియచేయనున్నట్టు తెలిపారు.

ప్రధాన మీడియా కార్పొరేట్ కనుసన్నల్లో మెలుగుతున్న దశలో సోషల్‌మీడియా గ్రామీణస్థాయిలో ప్రజా ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావాలని తమ్మినేని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ దివాలాకోరు విధానాలను ఎండగట్టాలన్నారు. గత ఐదేళ్లగా సామాజిక మార్పుల్లో సోషల్‌మీడియా కీలక భూమిక పోషించిందన్నారు. కొన్ని రాజకీయపార్టీలు సోషల్‌మీడియాను వేదికగా చేసుకుని ముందుకు వెళుతుండగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సోషల్‌మీడియాలో విషం వెదజల్లే పనిలో ఉందన్నారు. ఫేక్ వీడియోలతో విద్వేషాలు నింపే పనిలో బీజేపీ శ్రేణులున్నాయని తమ్మినేని దుయ్యబట్టారు. ప్రజలకు వాస్తవాలు చెప్పే విధంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో సీపీఎం రాష్ట్ర కారదర్శి వర్గ సభ్యులు అబ్బాస్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండారు రవికుమార్, జగదీష్, వై.విక్రమ్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ స్కామ్‌పై కొరడా

(5వ పేజీ తరువాయి)

పొందే అవకాశం ఉంటుంది. ఆరోగ్యశ్రీలో లేని రోగాలకు సైతం సీఎంఆర్ఎఫ్ సహాయం పొందే అవకాశం ఉంటుంది. సీఎం పేషీలో ఈ దరఖాస్తులు పరిశీలించి చెక్కుల రూపంలో ప్రజాప్రతినిధుల ద్వారా అందిస్తారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు బిల్లులు ధ్రువీకరించి ముఖ్యమంత్రి సహాయనిధికి పంపుతారు. ఇలా జరిగే క్రమంలో ఖమ్మంలోని పలు ఆస్పత్రులపై కేసులు నమోదయ్యాయి. వాటిపై తిరిగి విచారణకు రంగం సిద్ధమవుతోందని తాజాగా ప్రచారం జరుగుతోంది. ఇందులో గ్లోబల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, జేఆర్ ప్రసాద్, శ్రీవినాయక సూపర్‌స్పెషాలిటీ, శ్రీసాయి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, వైష్ణవి, సుజాత, న్యూ అమృత, ఆరెంజ్, మెగాశ్రీ, శ్రీకర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులున్నాయి. కాగా ఖమ్మంజిల్లాలో మొత్తం 19 ఆస్పత్రులను బ్లాక్‌లిస్టులో పెట్టామని, వాటినుంచి బిల్లులు పంప వద్దని ఇప్పటికే సీఎం సహాయనిధి పేషీనుంచి జిల్లాలోని ప్రజాప్రతినిధులకు జాబితాలు పంపారు. అందులో ఆదిత్య ఆస్పత్రి, ఎపెక్స్ ఆస్పత్రి, శ్రీసాయి మల్టీస్పెషాలిటీ, శ్రీకృష్ణ, ఆర్కా, ఆదర్శ మల్టీస్పెషాలిటీ, భార్గవ సూపర్‌స్పెషాలిటీ, డాక్టర్ జేఆర్ ప్రసాద్, గ్లోబల్, ఇండస్, మ్యాక్స్‌కేర్, న్యూ అమృత, ఆరెంజ్, సాయికిరణ్, శ్రీ వినాయక సూపర్‌స్పెషాలిటీ, సురక్ష, సుజాత ఆస్పత్రి, వైష్ణవి, వెంకటేశ్వర ఆస్పత్రులున్నాయి. పేద, మధ్యతరగతి వర్గాలు అనారోగ్యం పాలై ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకునేందుకు అవకాశం ఇస్తే దీనిని ప్రైవేటు ఆస్పత్రుల యాజమన్యాలు, దళారులు పక్కదారి పట్టిస్తున్నారు. దీని దరఖాస్తు విధానం కూడా లోపభూయిష్టంగా ఉంది. ప్రతిది ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుల చేసే అవకాశం ప్రభుత్వం వెబ్‌సైట్‌లు పెట్టింది. ఆరోగ్యశ్రీ విషయంలో ఆ పథకం అమలవుతున్న ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లు సంబంధిత శస్త్రచికిత్సకు కాని ఆస్పత్రిలో అడ్మిట్ అయిన వెంటనే రోగి పేరు, ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు వివరాలు ఆస్పత్రి నుంచే అప్‌లోడ్ చేసి అనుమతి పొందడం జరుగుతుంది. జిల్లాస్థాయిలో ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌కు వివరాలు వెళతాయి. తద్వారా సంబంధిత ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఎంతమంది చికిత్సలు పొందుతున్నారు. వారి బిల్లులపైనా రోజువారీగా ఆరోగ్యశ్రీ సిబ్బంది పర్యవేక్షణ చేస్తారు.

సీఎంఆర్ఎఫ్‌ను కూడా ఆరోగ్యశ్రీ విభాగానికి బదిలీ చేసి ప్రత్యేకంగా వెబ్‌సైట్ ద్వారా సహాయం కోసం దరఖాస్తుచేయడం, చికిత్స అనంతరం బిల్లులు సొంతంగా చెల్లించుకుని ఆరోగ్యశ్రీ విభాగం ద్వారా దరఖాస్తు చేసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సహాయం పొందే పద్ధతిని ప్రవేశపెట్టాలని కొందరు సూచిస్తున్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కూడా దీనిమీద పర్యవేక్షణ చేయడంలేదు. పూర్తిగా ప్రైవేటు ఆస్పత్రులు రోగులు బిల్లులు వైద్యం చేసినట్టుగా తీసుకుని ప్రజాప్రతినిధుల సిఫార్సులతోనే దరఖాస్తులు చేసి సమయం దొరికినప్పుడల్లా మోసాలకు పాల్పడుతున్నారు.

**ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా పర్యవేక్షించాలి..**
**బాగం కిషన్‌రావు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు**

సీఎంఆర్ఎఫ్ పర్యవేక్షణకు సరైన విధానం లేదు. ఆరోగ్యశ్రీ విభాగంతోనే సీఎంఆర్ఎఫ్‌నూపర్యవేక్షణ చేయించాలి. ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిపొందని వారికి కూడా సీఎంఆర్ఎఫ్ కింద వైద్యం పొందిన బిల్లుల్లో కొంత చెల్లిస్తున్నారు. ఆరోగ్యశ్రీకి ముందుగా అనుమతి ఇస్తున్నట్టుగానే సీఎంఆర్ఎఫ్ కూడా ఆస్పత్రులు, రోగులు తమ శస్త్రచికిత్సలు, వైద్యానికి జాయిన్ అయిన ఆస్పత్రి గురించి అందుకు ఖర్చయ్యే అంచనాలను నేరుగా సీఎంఆర్ఎఫ్ విభాగానికి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ముందుగానే అనుమతిపొంది బిల్లులు చెల్లిస్తే ఆ బిల్లులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రోగికి అవసరమైన సొమ్ము చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. దీని మీద జిల్లాస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది ప్రైవేటు ఆస్పత్రుల నుంచి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆరోగ్యశ్రీవలే ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొంది సీఎంఆర్ఎఫ్ కిందసాయం అందుకోవాలంటే ఆరోగ్యశ్రీ పరిధిలోకి సీఎంఆర్ఎఫ్‌ను కూడా తీసుకువచ్చి పర్యవేక్షణ చేయించాలి.

భద్రాద్రి రామయ్యకు

# ముత్తంగి సేవ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 26: భద్రాచలంలో సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు.

## రాధాకృష్ణ షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డు



ప్రశంసాపత్రం, చెక్కును చూపుతున్న రాధాకృష్ణ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు26: చైల్డ్ లేబర్, సైబర్ క్రైమ్, సెక్స్ హెరాస్‌మెంట్, రోడ్ యాక్సిడెంట్‌లపై జరిగే క్రైమ్‌లపై ఆంధ్రాలోని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడ సిటీ ఆధ్వర్యంలో షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్ నిర్వహించారు. ఈ కాంటెస్ట్‌లో సత్తుపల్లికి చెందిన ఇనపనూరి రాధాకృష్ణ రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌కు తెలుగు రాష్ట్రాల స్థాయిలో తృతీయ స్థానం లభించింది. ఈ సందర్భంగా సోమవారం విజయవాడ సిటీ కమిషనర్ చేతులమీదుగా ప్రశంసాపత్రంతో పాటు రూ.10వేల చెక్కును రాధాకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు అందుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, సమాజంలో జరుగుతున్న దుశ్చర్యలు, అనర్థాలు, యాక్సిడెంట్, మద్యపానం తదితర అంశాలను తాను ఇతివృత్తంగా తీసుకుని షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించానని చెప్పారు. చిన్నపిల్లను లైంగికంగా వేధించే విషయంలో పోలీస్ వారు ముందుగానే శిక్షణ ఇవ్వడం, చిన్నపిల్లలు తనను తాను ఆపద నుంచి ఎలా బయటపడింది అనే అంశంపై తాను షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించానన్నారు.

## అనారోగ్యంతో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మంజువాణి మృతి



మంజువాణి(ఫైల్)

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు26: ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.మంజువాణి (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగులు సంతాప సభ నిర్వహించి, సానుభూతి వ్యక్తం చేశారు. ఉద్యోగులందరిని కలుపుకొని పోయే స్వభావం ఉన్న కార్యదర్శి మృతి చెందడంతో అధికారులు, సిబ్బంది, పాఠకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## భార్యా భర్తల ఆత్మహత్యాయత్నం

● మల్లెలమడుగులో ఘటన

అశ్వాపురం, ఆగస్టు 26: కుటుంబ కలహాలతో భార్యా, భర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగా కాలనీకి చెందిన మండలపు వెంకటకృష్ణ స్వప్న దంపతులు రోజు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. కాగా వారు గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో భార్యా, భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. సోమవారం కుమార్తెను హాస్టల్‌కు పంపించే విషయంలో కూడా వివాదం జరగడంతో భార్యా, భర్తలు క్రిమిసంహారక మందు సేవించారు. గమనించిన స్థానికులు వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం దంపతుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

## ఉద్యోగం పేరిట రూ.లక్షన్నర టోకరా..

- కొత్తగూడెం మెడికల్ కాలేజీలో ఉద్యోగం ఇప్పిస్తామని మోసం
- పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు



మాట్లాడుతున్న సంఘవి

కామేపల్లి, ఆగస్టు26: ఉద్యోగం ఇప్పిస్తానని తమ గ్రామానికి చెందిన దంపతులు రూ.లక్షన్నర తీసుకొని మోసం చేశారని కామేపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన బాధితురాలు కొర్ర సంఘవి వాపోయారు. సోమవారం తాళ్లగూడెంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గోపాలపురం గ్రామానికి చెందిన కొర్ర సంఘవి అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన అజ్మీరా మాన్‌సింగ్-సుశీలబాయ్ దంపతులు, ఖమ్మానికి చెందిన మేకల వేంకటేశ్వర్లు కలిసి తమకు కొత్తగూడెం మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 2022వ సంవత్సరంలో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, ఆ ఉద్యోగానికి రూ.3లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. తొలుత మాట్లాడే సమయంలో రూ.50వేలు వారికి ఇచ్చినట్లు పేర్కొంది. అనంతరం రెండు నెలలలోపే రెండు దపాలుగా రూ.లక్ష ఇచ్చినట్లు తెలిపింది. అందరి సమక్షంలో కొత్తగూడెంలో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగానికి దరఖాస్తు చేశామని, కొన్ని అనివార్యకారణాలతో ఆనోటిఫికేషన్ రద్దు చేశారని తెలిపారు. అప్పటి నుంచి ఉద్యోగం అని అడిగితే కాలం గడుపుతూ వస్తున్నారు తప్ప, ఉద్యోగం ఇప్పించడం లేదని వాపోయింది. ఉద్యోగం ఇవ్వకపోయినా కాని, మా పైలు మాకు ఇవ్వండి అని అడిగిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాన్‌సింగ్ సుశీలాబాయ్, మేకల వెంకటేశ్వర్లుపై ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది.

# వాహనాల చోరీలు..



- బయటపెట్టి లోపలికి వెళితే అంతే...
- లబోదిబోమంటున్న వాహనదారులు
- ఫిర్యాదులు చేసినా.. కేసులు నమోదు చేయని పోలీసులు

ఖమ్మం క్రైం, ఆగస్టు26: నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాలను బయట ఎక్కడైనా నిలిపి వెళితే తిరిగి వచ్చేసరికి ఆ వాహనం కనపడడం లేదు. వాహనాల చోరీ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. రాత్రి సమయాలో ఇంటి ముందు నిలిపిన వాహనాలు కూడా మాయ మవుతున్నాయి. ఇటీవల కాలంలో వాహనాల చోరీలు ఎక్కువగా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చోరీ చేసిన వాహనాలను ఇష్టమెచ్చినట్టు నెంబర్ ప్లేట్లు మార్చి విచ్చలవిడిగా అమ్ముతున్నారు. పోలీసులు తనిఖీలలో నెంబర్ ప్లేట్లు, కాగితాలు చూసి జరిమానాలు వేస్తున్నారు, కానీ పూర్తి స్థాయిలో తనిఖీ ఉండడం లేదని తెలుస్తోంది.

**ప్రభుత్వ ఆసుపత్రిలో వాహనం పెడితే అంతే..**

నగరంలోని నిత్యం ప్రజలతో ప్రభుత్వ ఆసుపత్రి రద్దీగా ఉంటుంది. ఇది అదునుగా చుసుకున్న దొంగలు. చక్కగా వారి పని వారు చేసుకుంటూ వెళుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ద్విచక్రవాహనం నిలిపి వైద్యులను సంప్రదించి బయటకు వచ్చి చూస్తే వాహనాలు కనపడటం లేదు. ఈ చోరీ ఘటనలపై పోలీసులకు ఇప్పటివరకు పలు ఫిర్యాదులు కూడా అందాయి. ఇటీవల ఓ యువకుడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న తన బంధువులను చూసేందుకు వచ్చి వాహనం బయట పెట్టి లోపలికి వెళ్లాడు, తిరిగి వచ్చి చూడగా, వాహనం కనబడలేదు. దీంతో వాహనదారుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా ఇటీవల నగరంలో సుమారు 20కి పైగా వాహనాలు చోరీ జరిగినట్లుగా సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ద్విచక్రవాహనం పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేస్తే కనీసం పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నగరానికి చెందిన ఓ వ్యక్తి వైరా రోడ్డు ఓ బ్యాంక్ వద్ద తన ద్విచక్రవాహనాన్ని నిలిపి పనిపై బ్యాంక్‌లోకి వెళ్లాడు. పని ముగిసిన అనంతరం బయటకు వచ్చి చూడగా, వాహనం కనబడలేదు. దీంతో సంబంధింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు ఫిర్యాదు తీసుకున్నారు కానీ, పట్టించు కోలేదు. సార్ లేరు రేపు రండి అంటూ కొద్ది రోజులు తిప్పారు. ఆతరువాత మళ్లీ పట్టించుకోలేదు. వాహనదారుడు పోలీసులకు జూలై నెలలో 10న ఫిర్యాదు చేయగా, ఇంతవరకు కేసు నమెదు చేయలేదు. ఇటీవల సదరు వ్యక్తి మళ్లీ స్టేషన్‌కు వెళ్లగా, ఫిర్యాదు ఇచ్చిన సార్ బదిలీ అయ్యారు. తరువాత రండి అని చెప్పారు.

**చోరీ చేసిన వాహనాలకు వేరే నెంబర్ ప్లేట్లు**

వాహనాలు చోరీ చేసిన వారు, నెంబర్ ప్లేట్లను మార్చి దర్జాగా తిరుగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చోరీకు గురైన వాహనాలు కొద్దిగా మార్పులు చేసి, తక్కువ ధరలకు అమ్ముతున్నారని సమాచారం. అదేవిధంగా వాహనాలకు వేరే జిల్లాల వాహనాల నెంబర్ ప్లేట్లు తగిలించి తిరుగుతున్నారు. అదేవిధంగా ఆంధ్ర రాష్ట్రంలోని ఓ ప్రాంతానికి చోరీ చేసిన వాహనాలు తీసుకు వెళితే అక్కడున్న కొంతమంది పాత వాహనాల చాయిస్ నెంబర్ రాడ్డులను కట్ చేసి, ఈ వాహనాలకు అమరుస్తున్నారని ప్రచారం జరుగు తోంది.

కోదాడ ప్రాంతానికి చెందిన ఓవ్యక్తిని పోలీసులు చలానా కట్టాలని వాహనాన్ని ఆపారు. దీంతో చలనాలు చూడగా చాలా ఉన్నాయి. వాటి ఫొటోలు చూడగా అది తన ద్విచక్రవాహనం కాదు. ఇది నాది కాదు సార్ అని చెప్పినా వినలేదు. ఆ ద్విచక్రవాహనం నెంబర్ ప్లేట్‌ను మార్చి, ఖమ్మం జిల్లాలోని వెంసూరు ప్రాంతంలో తిరుగుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా పోలీసులు తనిఖీలు చేయడంలో పెండింగ్ చలానాలు, నెంబర్ ప్లేట్లు సరిగా ఉన్నాయా లేదా అని చూస్తున్నారు కానీ, వాహనం ఎవ్వరిది అని పట్టించుకోకనే ఇలా జరుగుతున్నాయని వాహనదారులు అంటున్నారు.

**కనబడని పెట్రోలింగ్ వాహనాలు**

పెట్రో కారు సిబ్బంది ప్రధాన రోడ్ల పై తిరుగుతున్నారు కానీ, చిన్న చిన్న వీధులలోకి రావడం లేదని నగరంలో పలువురు అంటున్నారు. సైరన్ వేసినా లోపలకి రారులే అని దొంగలు వారి పని వారు చేసుకుంటూ వెళుతున్నారు. వారు పెట్రోలింగ్ విధులలో ఉంటూ అర్ధరాత్రి సమయాలలో వెళుతున్న వాహనదారులను ఆపి ప్రశ్నలు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది సిబ్బంది అయితే ఈ టైంలో ఎందుకు బయటకు వచ్చారు అంటూ ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా బ్లూకోల్ట్ సిబ్బంది కూడా రాత్రి రెండు గంటల తరువాత బస్‌స్టాండ్‌లలో ఉంటున్నారు కానీ, సరిగా విధులు నిర్వహించడం లేదని ప్రచారం జరుగుతోంది.

## క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న కాశీ హుస్సేన్

● రెజ్లింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.కాశీ హుస్సేన్

చుంచుపల్లి, ఆగస్టు 26: క్రీడాకారులు మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని ఒలంపిక్‌లో పతకాలను గెలుపొందేందుకు కృషి చేయాలని రెజ్లింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ సూచించారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని అండర్-14 జిల్లా స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 60 మంది బాల, బాలికలు ఈ పోటీలలో పాల్గొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఐ.ఆదినారాయణ ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు పతకాలను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నిహారిక, వివిధ క్రీడా అసోసియేషన్ బాధ్యులు ఇ.మొగిలి, కె.శ్రీనివాస్, జి.కృష్ణ, జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు



ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వి. సుబ్బారావు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 26: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్ల వైద్యధికారి డాక్టర్ వి. సుబ్బారావు అన్నారు. సోమవారం నగరంలోని 42వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయనిర్మల, వైద్యాధికారి దేవశ్రీ, సూపర్‌వైజర్లు జైపాల్, మన్సన్, వెంకటేశ్వర్లు, అర్బన్ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలం వద్ద పెరుగుతున్న

## గోదావరి నీటి మట్టం



ఉధ్రుతంగా ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం, ఆగస్టు 26: ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గత 24 గంటలుగా క్రమేపి పెరుగుతోంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గోదావరి నీటి మట్టం 21.6 అడుగులు ఉంది. అక్కడ నుంచి పెరుగుతూ వస్తున్న గోదావరి నీటి మట్టం సోమవారం రాత్రి 7 గంటల వరకు 27.5 అడుగులకు చేరుకుంది. ఈ నీటి మట్టం మరో నాలుగు అడుగులు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## 'పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని విజయవంతం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 26: నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిన సెప్టెంబర్ 1 వ తేదీని పెన్షన్ వ్యతిరేక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, ఉద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. సోమవారం టీఎన్జీవో, టీజీవో ఆధ్వర్యంలో టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని నిరసన దినానికి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా టీఎన్జీవో అడ్‌హక్ కమిటీ కో కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాల్నారు.. నూతన పెన్షన్ విధానం ఉద్యోగుల భవిష్యత్ లేకుండా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పాలిట శాపంగా పరిణమించిన నూతన పెన్షన్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే వరకు సమైఖ్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన రాష్ట్రంలోనే మహోద్యముగా గుర్తింపు పొందేలా సన్నద్ధం, సమాయత్తం కావాలని కోరారు. తొలుతగా నిరసన ర్యాలీతో ఆరంభమయినా ఈ నిరసన కార్యక్రమం దానికి రద్దు చేసేంత వరకు ఉద్యోగుల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఖమ్మం నడిబొడ్డున ఉన్నటువంటి అమర వీరుల స్తూపం వద్ద నుంచి నిరసన ర్యాలీ ప్రారంభించాలని అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, రంగారావు, నాగ మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, మంగ్య నాయక్, పాపలాల్, మత్సలర్, వీరూ నాయక్, నాల్గొవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు బిక్కు, రమణ, డ్రైవర్ల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, వేణు, లక్ష్మణ్‌రావు, అనురాధా, జడ్ ఎస్ జైపాల్, శ్రీధర్ సింగ్, గుంటిపల్లి శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, దుర్గా ప్రసాద్, పెద్దినేని రాధాకృష్ణ, టీఎన్జీవో మాజీ జిల్లా అధ్యక్షుడు పి రాజారావు, సగ్గుర్తి ప్రకాష్ రావు పాల్గొన్నారు.

## వివాహితతో చాటింగ్... యువకుడిపై దాడి

ఖమ్మం క్రైం, ఆగస్టు 26: సోషల్ మీడియాలో పరిచయమైన ఓ వివాహితతో చాటింగ్ చేస్తుండటంతో వివాహిత కుటుంబ సభ్యులు యువకుడిపై దాడి చేసిన సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ప్రకాష్ నగర్‌లో నివసించే బరపట్ల గణేష్ నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల సోషల్ మీడియాలో ఓ వివాహిత పరిచయం కాగా ఆమెతో చాటింగ్ చేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన వివాహిత కుటుంబ సభ్యులు గత నాలుగు రోజుల క్రితం యువకుడిని హెచ్చరించారు. సోమవారం మరోసారి ఈ ఘటనపై మాట్లాడాలని వివాహిత కుటుంబ సభ్యులు నయబజార్ స్కూల్ వద్దకు రావాలని పిలిచారు. దీంతో యువకుడితో పాటు అతడి అక్క నందిని, తల్లి వెంకటమ్మ కలిసి స్కూల్ వద్దకు వెళ్లారు. అక్కడకి వెళ్లిన తర్వాత వివాహిత భర్తతో పాటు మరికొందరు కలిసి వారిపై కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన వారు పోలీసులకు సమాచారం అందించి, ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. అనంతరం ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గొర్రెపొటేళ్లు, మేకపోతు అపహరణ

ముదిగొండ, ఆగస్టు 26: రెండు గొర్రెపొటేళ్లు, ఒక మేకపోతును గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయిన సంఘటన ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బాణాపురం గ్రామానికి చెందిన వత్సవాయి దేవేందర్ తన కుమార్తె పెళ్లి కోసం రెండు గొర్రెపొటేళ్లు, ఒక మేకపోతును కొనుగోలు చేశాడు. వాటి విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని, వాటిని తన ఇంటి ముందు కట్టేసి నిద్రపోయారు. కాగా ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాటిని దుండగులు అపహరించుకుపోయారని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముదిగొండ ఎస్‌హెచ్‌వో వడ్డేపల్లి మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దివ్యాంగుడికి మంత్రి పొంగులేటి సాయం

- తక్షణమే రూ.50వేల ఆర్థికసాయం అందజేత



దివ్యాంగుడికి చెక్కు అందిస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఆగస్టు 26: మండల కేంద్రంలో అగ్ని ప్రమాదంతో నష్టపోయిన ఓగిరిజన దివ్యాంగ యువకుడి పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉదారాన్ని చాటారు. లోక్యాతండాకు చెందిన వడిత్య రాంబాబు పుట్టుకతో పోలియో వచ్చింది. అయినప్పటికీ తన కాళ్లపై తాను నడిచేందుకు కూసుమంచిలో మొబైల్ షాపు పెట్టుకుని నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో ఇటీవల షాపు అగ్ని ప్రమాదానికి గురైంది. సుమారు రూ.5లక్షల మేర నష్టపోయాడు. సమాచారం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో రాంబాబుకు రూ.50వేల చెక్కు అందించి ఉదారత చాటుకున్నారు.

## జోగ్గూడెంలో పందెం కోళ్లు మాయం



ఓ దొంగ చికెన్ షాపులోకి ప్రవేశిస్తున్న దృశ్యం

కామేపల్లి, ఆగస్టు26: పందెం కోళ్లు మాయమైన సంఘటన కామేపల్లి మండలం జోగ్గూడెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జోగ్గూడెం గ్రామానికి చెందిన జర్పల చంద్రు ఇంట్లో ఉన్న 17 పందెం కోళ్లను, మాజీ సర్పంచ్ జర్పల రామోజీ ఇంట్లో ఉన్న 8 కోళ్లను గుర్తు తెలియని దొంగలు చుట్టు ఉన్న జాలీలు కత్తిరించి పందెం కోళ్లను ఎత్తుకెళ్లారు. ఇటీవల నాలుగు రోజుల క్రితం మాజీ సర్పంచ్ ఫుల్‌సింగ్ ఇంట్లో కూడా జాలీని కట్ చేసి 5కోళ్లను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితులు సీసీ పుటేజీలో చూడగా ఓ వ్యక్తి మాస్క్, చేతికి గ్లౌజ్‌లు వేసుకొని ఉన్నట్లు తెలిసింది.

## కోమట్లగూడెంలో చోరీ

చింతకాని, ఆగస్టు 26: మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలోని రాచబంటి చంద్రయ్య ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చంద్రయ్య తన ఇంటికి తాళం వేసి భార్యతో కలసి ఆదివారం కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామంలో ఉన్న చర్చికి వెళ్లాడు. మధ్యాహ్నా సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రూ. 1.20 లక్షల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఇంటి ముందు గదిలో నివాసం ఉండే చంద్రయ్య కుమారుడు వలరాజు దుండగుల వెంటపడగా పరారైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని వలరాజు తండ్రికి చెప్పగా, అతడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నాగుల్ మీరా సోమవారం తెలిపారు.

## వ్యక్తిని దూషించిన ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని, ఆగస్టు 26: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన శీతల రామసంగం, నాగులవంచ గ్రామానికి చెందిన వంకాయలపాటి సత్యనారాయణ అను ఇద్దరు వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులవంచ గ్రామానికి చెందిన వంకాయలపాటి దాసయ్యకు చెందిన వ్యవసాయ భూమిలోకి శీతల రామసంగం, వంకాయలపాటి సత్యనారాయణ ఈనెల 22న అక్రమంగా ప్రవేశించి రహదారిని నిర్మిస్తున్నారు. విషయం తెలిసిన దాసయ్య కుమారుడు రామారావు అక్కడికి వెళ్లి ఇదేమిటని ప్రశ్నించగా, అతడిని దుర్భషలాడుతూ చంపుతామని బెదిరించారు. ఈ విషయమై రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

# దంపతులకు విద్యుత్‌షాక్

● భార్య మృతి.. చావుబతుకుల మధ్య భర్త.. ● పాండురంగాపురంలో విషాదం

పినపాక, ఆగస్టు 26: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని పాండురంగాపురంలో దంపతులు విద్యుత్ షాక్‌కు గురికాగా, వారిలో భార్య ప్రాణాలు కోల్పోయింది. భర్త అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. పాండురంగాపురానికి చెందిన కొమరం సర్వేశ్, సమ్మక్క(24) దంపతులు కిరాణా దుకాణం నడుపుతూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి పండుగ కావడంతో ఉదయం దంపతులిద్దరూ సామగ్రిని సర్దే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఇంట్లో వున్న ఐరన్ పైపులను ముట్టుకున్న సమ్మక్క విద్యుత్‌షాక్‌కు గురై కేకలు వేసింది. ఇది గమనించిన సర్వేశ్ ఆమెను లాగేందుకు ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయారు. వారి కేకలు విన్న ఇరుగుపొరుగు వారు వెంటనే వారిని మణుగూరులోని 100 పడకల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సమ్మక్క మృతి చెందినట్టు తెలిపారు. భర్త సర్వేష్ అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. వీరికి ఓ బాబు, ఓ పాప ఉన్నారు. తల్లి మరణం, తండ్రి ఆస్పత్రిలో చికిత్స పొం దుతుండడంతో పిల్లల దీనస్థితి ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది. ఘటనా స్థలాన్ని ఏడూళ్లబయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ పరిశీలించి, కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. రెవెన్యూ శాఖ ఆర్ఐ రమేష్ పరిశీలించి, పంచానామా చేశారు. ఇంట్లో వున్న కరెంటు సిల్క్‌వైరును అక్కడక్కడా ఎలుకలు కొరికివేయడంతో దాని ద్వారా ఐరన్‌పైపులకు కరెంటు సరఫరా జరిగి ఉంటుందని, వాటిని సర్వేశ్ దంపతులు ముట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యారని బంధువులు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో సర్వేశ్ పిల్లలు నిద్రలోనేవున్నారు.

## మదర్‌థెరిస్సా జయంతి



మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తల్లాడ, ఆగస్టు 26: తల్లాడలో మదర్‌థెరిస్సా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మదర్‌థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్స్, దాసరి వీరభద్రరావుయూత్ క్లబ్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లోని మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మదర్‌థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు కొత్తూరి పణి, దాసరి వీరభద్రరావు యూత్‌క్లబ్ అధ్యక్షుడు దుగ్గిదేవర అజయ్‌కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుడిపల్లి నారాయణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, సైదులు, కృష్ణారావు పాల్గొన్నారు.

## నేడు 'మీ ఎమ్మెల్యే మీ ఇంటికి' కార్యక్రమం

● సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అశ్వారావుపేట, ఆగస్టు 26: 'మీ ఎమ్మెల్యే మీ ఇంటికి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అశ్వారావుపేట మండలంలో పర్యటిస్తున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వర్గాలు వెల్లడించాయి. ఉదయం 7గంటలకు ఎమ్మెల్యే పర్యట మండలంలోని రెడ్డిగూడెంలో ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి లబ్ధిదారునికే అందజేస్తారు. ఇందులో భాగంగా రెడ్డిగూడెం, తిరుమలకుంట, ఉసిర్లగూడెం, మామిళ్లవారిగూడెం, కోర్సగూడెం, సున్నంభట్టి, మొద్దులమాడ, దురదపాడు, నందిపాడు, గుమ్మడపల్లి, కోయరంగాపురం, పెదవాగు ప్రాజెక్టు, బచ్చువారిగూడెం, నారాయణపురం, గ్రామాలలో మంజూరైన 11 సీఎంఆర్ఎఫ్, 55 కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్టు క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## బాధిత కుటుంబానికి మంత్రి పొంగులేటి పరామర్శ


నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు26: కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా పూర్ణ కుటుంబాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు పూర్ణ తండ్రీ అజ్మీరా ఉమ్లనాయక్ ఈ నెల 13న మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి సోమవారం కొత్తగూడెం పట్టణం 20వ వార్డులోని పూర్ణ స్వగృహాన్ని సందర్శించారు. ఉమ్లనాయక్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. పూర్ణ, సతీమణి 20వ వార్డు కౌన్సిలర్ అజ్మీరా సుజాతలతో పాటు కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

**మంత్రి పొంగులేటికి వినతి ..**

కొత్తగూడెం పట్టణ పరిధిలోని 31వ వార్డు రైటర్ బస్తీ, గొల్లగూడేనికి చెందిన రెహానా దంపతులు తన చిన్నారి పాపకు సామాజిక పించన్ అందించాంటూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ పాప అమీన న్యూరోజనిక్ బ్లాడర్, కాన్స్టిపేషన్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో వైద్యులు అగ్మంటేషన్ సిస్టోప్లాస్టీ మరియు మానిటీ, ఎంఎసిఇ ప్రత్యేక శస్త్ర చికిత్స చేసిన ఫలితం లేకపోయిందని వెల్లడించారు. లక్షలు వెచ్చించి శస్త్ర చికిత్స చేయించినప్పటికి ఉపయోగం లేకుండా పోయిందని, కిడ్నీ ఇన్ఫెక్షన్ కాకుండా ఉండేందుకు ప్రతి నెల కనీసం రూ. 15 వేలు ఖర్చు అవుతుందని విలపించారు. అధనంగా పాప ఆరోగ్య రిత్యా వైద్య పరీక్షల కోసం స్కానింగ్, వైద్య ఖర్చులు అధనపు భారంగా మారుతోందని , కూలి చేస్తే ఇల్లు గడవని పేదరికంతో బాధపడుతున్న తమకు కూతురిని కాపాడుకునేందుకు అప్పులు చేసి వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొందని కన్నీటి పర్యంతం అయ్యారు. తమ పాపకు మానవతా దృక్పదంతో సామాజిక పించన్ మంజూరు చేయాలని మంత్రిని అభ్యర్థించారు. ప్రభుత్వం తరుపున సమస్యను పరిశీలించి త్వరతగతిలోనే పరిష్కారం చూపుతామని ఆ పేద కుటుంబానికి మంత్రి పొంగులేటి బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళీ, కంచర్ల చంద్రశేఖర్‌రావు, వూకంటి గోపాల్‌రావు, దేవిప్రసన్న, కూరపాటి రాజేష్, అంబటి శ్రీను, మహమూద్, నవీన్, సందీప్, మౌనిష్, కేతన్, ఊటుకూరి విజయ్, ఊటుకూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

అశ్వాపురం ఆగస్టు 26: మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్‌రోడ్‌కు చెందిన కోపూరు రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రాంబాబు అశ్వాపురం జడ్పీహైస్కూల్‌లో స్వీపర్‌గా పనిచేసేవాడు. ఈనేపథ్యంలో రాంబాబు నిరుపేద కావటంతో అతని ఉత్తరక్రియలకు జడ్పీ హైస్కూల్ 1985-86 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు రూ.11వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం రాంబాబు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నంబూరి వెంకటేశ్వరరావు,నల్లగట్ల సత్యప్రకాష్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణుడి అవతారంలో ఏడాది చిన్నారి లేఖాన్ష్ సాయి కార్తీక్

జిల్లా వ్యాప్తంగా సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గృహాల్లో శ్రీ కృష్ణుడి ప్రతిమలను ఉంచి పూలమాలలతో విశేష అలంకరణ చేసి స్వామికి ప్రీతికరమైన వెన్న, పిండి వంటకాలు చేసి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో ఉట్టు కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించారు. మండలాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చేశారు.


కొత్తగూడెంలో..


చంద్రుగొండలో..


అశ్వారావుపేటలో రాధాకృష్ణుల వేషాధారణలో చిన్నారులు..


బూర్గంపాడు మండలం సారపాకలో..


అన్నపురెడ్డిపల్లిలో ఎమ్మెల్యే జారే పూజలు


అశ్వారావుపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


గుండాలలో కృష్ణుడు, గోపికల వేషాధారణలో చిన్నారులు..


ఆళ్లపల్లిలో గోపికలు


అశ్వారావుపేట అటెండర్స్ కాలనీలో ఉట్టికొడుతున్న మహిళలు


కొత్తగూడెంలో ఉట్టి కొడుతున్న యువతులు

## సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

పాల్వంచ టౌన్, ఆగస్టు 26: జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై సామాజిక సేవా కార్యకర్త యడ్లపల్లి శ్రీనివాసరావు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి పాల్వంచ బస్టాండ్‌లో సమస్యలతోపాటు దమ్మపేట, చంద్రుగొండ, అశ్వాపురం, బూర్గంపాడు, బయ్యారం మండల కేంద్రాల్లో బస్టాండ్‌లు ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భద్రాచలం హైవేపై ఉన్న సమస్య, రూరల్ పోలీస్‌స్టేషన్ కిన్నెరసానిలో పెట్టడం వల్ల కలిగే అసౌకర్యం పై చర్యలు తీసుకోవాలని మంత్రికి అందచేసిన వినతిపత్రంలో ఆయన కోరారు.

## త్రివేణి పాఠశాలలో మధర్‌థెరిస్సా జయంతి


నివాళులర్పిస్తున్న పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 26: మండల పరిధిలోని త్రివేణి పాఠశాలలో సోమవారం మదర్‌థెరిస్సా జయంతిని వేడుకగా నిర్వహించారు. మదర్‌థెరిస్సా చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అనే నానుడి మదర్‌థెరిస్సా నిజం చేశారని, ఎంతోమంది అభాగ్యులను అక్కున చేర్చుకుని సేవలు అందించిన ఘనత ఆమెకే దక్కుతుందని కీర్తించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్, సీఆర్‌వో మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ వైవి. సురేష్, శ్రీనివాస్‌సింగ్, సౌజన్య, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలి

దమ్మపేట, ఆగస్టు 26: మధ్యాహ్న భోజన కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనాన్ని ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి, జిల్లా కోశాధికారి పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్, నాయకులు ఈశ్వరమ్మ, జయ, సుజాత, వెంకటమ్మ, సీత, సత్యావతి, శ్రీను, శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఐద్వా

దమ్మపేట, ఆగస్టు 26: కోల్‌కత్తాలో శిక్షణ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన జరిపారు. మండల కమిటీ ఆధ్వర్యంలో రేపిష్టుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ ఎన్ని కఠినమైన చట్టాలు ఉన్నా మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యతులో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే నెరవేర్చాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకంగా కొనసాగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వారికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 8నెలలు గడిచిన ఇంత వరకు ఆ ఊసే ఎత్తడం లేదని, ఇది సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరునాయక్, వంగా రవిశంకర్, వినయ్, బాబీ, మురళీ పాల్గొన్నారు.

## వర్గీకరణను వ్యతిరేకించడం తగదు: ఎమ్మార్పీఎస్

జూలూరుపాడు, ఆగస్టు 26: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే వారంతా తమ ఉనికిని కాపాడుకోవడానికే పోరాటాలు నిర్వహిస్తున్నారని, వారు ఎన్ని కుట్రలు చేసినా చివరికి ధర్మమే గెలుస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చెంగల గురునాధం అన్నారు. సోమవారం జూలూరుపాడులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు డెబ్బెందుల సాయికుమార్ అధ్యక్షతన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా సామాజిక న్యాయం కోసం సుదీర్ఘ పోరాటం ఎమ్మార్పీఎస్ చేస్తుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్ధతు తెలిపాయని అన్నారు. వర్గీకరణ అంశం ఎవరి హక్కులను, రిజర్వేషన్‌లను తీసివేసేదికాదని, తమకు రావాల్సిన న్యాయమైన రిజర్వేషన్‌ను మాత్రమే కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాకటి వెంకటి, మోదుగు శివకుమార్, సంతోష్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

అశ్వాపురం ఆగస్టు 26: అశ్వాపురం శివారు చవిటిగూడెం లోని అభయాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక సోమవారం భక్తుల సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా తాడబోయిన వెంకటేశ్వర్లు, నూకల లింగయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా భూతం వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా గాదె కేశవరెడ్డి, నక్కనబోయిన పాపారావు, ప్రచార కార్యదుర్శులుగా వలపోజు మురళీకృష్ణ, కొర్లకుంట శ్రీనివాస్ నియమితులయ్యారు.

## దివ్యాంగుల పిల్లలకు ఉచితంగా పరికరాల పంపిణీ

జూలూరుపాడు, ఆగస్టు 26: దివ్యాంగుల చిన్నారుల కోసం కొత్తగూడెంలోని ఆనందగని ఉన్నత పాఠశాలలో మంగళవారం అలీంకోవారు ప్రత్యేకంగా శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, దీనిని దివ్యాంగుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గుగులోత్ వెంకట్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల లోపు దివ్యాంగుల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అలీంకో కంపెనీ వారు ఉచితంగా పరికరాలను అందిస్తారని అన్నారు. ఈ శిబిరానికి దివ్యాంగులు హాజరు కావాలని ఆయన కోరారు.

## తప్పులు లేకుండా ఓటరు జాబితా ఉండాలి


ఓటరు లిస్టుల తయారుచేసుకుంటున్న పంచాయతీ సిబ్బంది

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 26: పంచాయతీల్లో ఓటరు లిస్టులను సమగ్రంగా ఉండేలా తయారుచేసుకోవాలని ఎంపీవో ప్రసాదరావు సూచించారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ముసాయిదా ఓటర్ల జాబితా కసరత్తు ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. అశ్వారావుపేట పంచాయతీ కార్యాలయంలో అశ్వారావుపేట, గుర్రాలచెరువు, పేరాయిగూడెం, అల్లిగూడెం గ్రామపంచాయతీలకు చెందిన అధికారులు సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితా తయారుచేసుకుని పనిని సాగించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీవో ప్రసాదరావు పరిశీలించారు. ఓటర్ల జాబితా తప్పులు లేకుండా సమగ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మిగిలిన పంచాయతీల్లోనూ కార్యక్రమం సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీరామమూర్తి, సందీప్, స్వరూప, సిబ్బంది ఉన్నారు.

## మాలమహానాడు మండల కమిటీ ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, రామారావు

జూలూరుపాడు, ఆగస్టు 26: మాల మహానాడు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సోమవారం జూలూరుపాడులో ఆ సంఘం జిల్లా నాయకులు ఇల్లంగి తిరుపతి, గడిదేశి కాంతయ్యల సమక్షంలో నిర్వహించారు. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన బుడిపుడి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పోతురాజు రామారావులను నియమించారు. వ ర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుడిపుడి ప్రతాప్, కన్వీనర్‌గా వల్లమల్ల సామేలు, ఉపధ్యక్షుడిగా బోగిళ్ళ రమేష్, సహాయ కార్యదర్శిగా ఇల్లంగి సుందర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా ఇల్లంగి రాంబాబు, మందా వెంకటేశ్వర్లు, కాశిమళ్ళ సురేష్‌లతో పాటు, కోశాధికారులుగా బోడా నాగరాజు, పణితి వెంకటేశ్వర్లు, పత్తిపాటి యోహాన్‌లను ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బరగడ రమేష్, కార్యదర్శిగా కల్లోజి వెంకటేశ్వర్లు, ఉపధ్యక్షుడిగా కల్లోజి శివ, సహాయ కార్యదర్శిగా కాశిమళ్ళ కమలాకర్, పణితి గోపాలకృష్ణలతో పాటు, యూత్ మండల కమిటీ అధ్యక్షుడిగా కల్లోజి దినేష్, ఉపధ్యక్షుడిగా పప్పుల రాములను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు గత్తం బాబూరావు, మందా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య శిబ్బంది

మణుగూరు, ఆగస్టు 26: ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రభుత్వ వైద్య అధికారి శివకుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని తోగ్గూడెం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరాలు, దగ్గు, జలుబు, తీవ్రమైన ఒంటినొప్పులతో బాధ పడేవారిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. పరిసరాలను ప్రతిఒక్క ఇంటి యజమాని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మరిగించి చల్లార్చి వడకట్టిన మంచినీటినే తాగాలని మండల ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆఫీస్ హెచ్‌ఈవో గొంది వెంకటేశ్వర్లు, హెచ్‌వి జానకి,అసిస్టెంట్ ఉమేష్, ఎంఎల్ హెచ్‌పి హిమబిందు, వెంకటలక్ష్మి, ఎఎన్ఎం విజయలలిత, అనసూర్య పార్వతి, 104 శ్రీకాంత్ సేవలందించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో

## ఏపీపీ దంపతుల పూజలు




పూజలు చేస్తున్న ఏపీపీ దంపతులు, ప్రదక్షణలు చేస్తున్న ఏపీపీ విజయదుర్గాలక్ష్మి

జూలూరుపాడు, ఆగస్టు 26: మండలంలోని కాకర్ల గ్రామంలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని సోమవారం భద్రాద్రి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) విజయదుర్గాలక్ష్మీ - ప్రభాకర్ దంపతులు సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చెరుకుమల్లి కృష్ణయ్య, మిరియాల రమేష్‌ల ఆధ్వర్యంలో సన్మానం చేశారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


లబ్ధిదారులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు, ఆగస్టు 26: ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండల పరిదిలోని మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ వారపుసంత ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం పాల్గొన్నారు. 32మంది లబ్ధిదారులకు రూ.14లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే..ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పథకాలను ప్రవేశపెడుతుందని అన్నారు. అనంతరం మోరంపల్లిబంజర గ్రామంలోని పీహెచ్‌సీని సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరుగున పడిన నవోదయ స్కూల్ నిర్మాణం

●పట్టించుకోని అధికారులు ●శంకుస్థాపనకే పరిమితమయిన రహదారి ఏర్పాటు


నవోదయ స్కూల్ రహదారికోసం భూమిపూజ కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

అశ్వాపురం ఆగస్టు 26: మండల పరిధిలోని బీజీ కొత్తూరువద్ధ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నవోదయ పాఠశాల నిర్మాణం మరుగున పడింది. 2023 మేలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒక నవోదయ పాఠశాలను కేటాయించగా అప్పటి ప్రభుత్వం పినపాక నియోజక వర్గంలో ఏర్పాటు చేయాలని భావించింది. ఇందుకోసం మండల పరిధిలోని బీజీ కొత్తూరు వద్ద కలెక్టర్ ఆదేశం మేరకు సంబందిత అధికారులు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించారు. అదేవిధంగా పాఠశాలకు రహదారి నిర్మాణంకోసం రాష్ట ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రత్యేక నిధుల నుంచి రూ.కోటి యాభై లక్షలు కేటాయించింది. దీంతో టెండర్ ప్రక్రియ పూర్తి కావటంతో అదే ఏడాది అక్టోబరులో అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన జరిపారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావటంతో నవోదయ స్కూల్ ఏర్పాటుతో పాటు రహదారి నిర్మాణం కూడా నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం అ ధికారులు పట్టించుకోక పోవటంతో నవోదయ పాఠశాల ఏర్పాటు మరుగున పడింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఏజెన్సీలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయించి ఈ ప్రాంత గిరిజన, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని పలువురు కోరుతున్నారు.